సాక్షి
విశాఖపట్నం

బుధవారం ; 11 ; జూన్ ; 2025

నయన మనోహరం..వెంకన్న నౌకా విహారం





నిత్యం పాలకడలిలో పవళించి ముల్లోకాలను బ్రోచే నారాయణుడు వేంకటేశుడై జలధిలో విహరించిన మనోహర దృశ్యం సాగరతీరంలో ఆవిష్కృతమైంది. ఈ దివ్య ఘట్టాన్ని తిలకించి భక్తజనకోటి మురిసింది. పోర్టు ప్రాంతంలోని శృంగమణి పర్వతంపై ఉన్న వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం సాయంత్రం తెప్పోత్సవం ఘనంగా సాగింది.

8లో

న్యూస్‌రీల్

నేడు అప్పన్నకు మూడో విడత చందనం సమర్పణ



చందనంలో సుగంధ ద్రవ్యాలు కలుపుతున్న వైదికులు

సింహాచలం: జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారికి బుధవారం మూడో విడత చందన సమర్పణ కార్యక్రమం జరగనుంది. తెల్లవారుజామున అర్చకులు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఇప్పటికే సిద్ధం చేసిన మూడు మణుగుల (సుమారు 125 కిలోలు) పచ్చి చందనంలో మంగళవారం వైదికులు పలు రకాల సుగంధ ద్రవ్యాలను కలిపి సమర్పణకు సిద్ధం చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు, ఉప ప్రధానార్చకుడు సాతులూరి నరసింహాచార్యులు, అర్చకుడు అప్పాజీ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మూడో విడత చందన సమర్పణ కారణంగా బుధవారం అన్ని ఆర్జిత సేవలను రద్దు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి జ్యేష్ఠాభిషేకం నిర్వహించనున్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ల బదిలీ

విశాఖ లీగల్: నగరంలోని పలువురు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బి.రామకోటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం మొబైల్ కోర్టు ఏపీపీ పి.శాంతి గౌతమి భీమిలి 16వ ప్రధాన శ్రేణి న్యాయస్థానం అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. పాడేరు మెజిస్ట్రేట్ కోర్టు ఏపీపీ వీ. రమేష్, భీమిలి 14వ ప్రథమ శ్రేణి మేజిస్ట్రేట్ కోర్ట్ ఏపీపీగా వస్తున్నారు. నగరంలోని ఒకటవ ప్రధాన మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు ఏపీపీ ఎం షణ్ముఖ ఎక్సైజ్ కోర్టు ప్రత్యేక ఏపీపీగా నియమితులయ్యారు. ఎక్సైజ్ కోర్టు ఏపీపీ కె విమల్ రాథోడ్, ఫస్ట్ ఏసీఎం కోర్టు ఏపీపీగా వస్తున్నారు.

ఏడుగురు అప్పన్న దేవస్థానం ఉద్యోగులకు బదిలీ

సింహాచలం: రాష్ట్రవ్యాప్తంగా దేవదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో జరిగిన ఉద్యోగుల బదిలీల్లో భాగంగా సింహాచలం దేవస్థానంలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు ఉద్యోగులు ఇతర దేవస్థానాలకు బదిలీ అయ్యారు. సింహాచలం దేవస్థానం ఈఈ బి. రాంబాబును విజయవాడ దేవస్థానానికి బదిలీ అయ్యారు. డి.వి.ఎస్. రామరాజు, ఏఈ..విశాఖలోని కనకమహాలక్ష్మి దేవస్థానంకి బదిలీ అయ్యారు. సూపరింటిండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న పి. సునీల్ కుమార్ అరసవెల్లి దేవస్థానానికి, సీనియర్ అసిస్టెంట్ బి. అనురాధను కనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానానికి, సీనియర్ అసిస్టెంట్ డి. వెంకటరమణను అరసవెల్లి దేవస్థానానికి బదిలీ చేశారు. జూనియర్ అసిస్టెంట్ కె. కార్తీక్ నాగ్.. కనకమహాలక్ష్మి దేవస్థానానికి, జూనియర్ అసిస్టెంట్ బి. బాలభాస్కర సాయిని అరసవెల్లి దేవస్థానానికి బదిలీ చేశారు. మంగళవారం ఉద్యోగులను దేవస్థానం ఈవో వి. త్రినాథరావు రిలీవ్ చేశారు.

వాన..ఈదురుగాలులు



పాండ్రంగిలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

మహారాణిపేట: మూడు రోజులుగా ఎండ వేడిమి, ఉక్కబోతతో అల్లాడుతున్న నగరవాసులకు మంగళవారం కురిసిన వర్షం ఎంతో ఉపశమనాన్నిచ్చింది. రుతుపవనాల రాక, వాతావరణంలో మార్పుల కారణంగా గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగాయి. ఒకవైపు ఉక్కబోత, మరోవైపు వేడిగాలులు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం నుంచి నగరంలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం దంచికొట్టింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. జోరున కురిసిన వర్షంతో పాటు వీచిన ఈదురుగాలుల ప్రభావంతో పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. పందిమెట్ల, బుల్లయ్య కాలేజీ సమీపంలో భారీ వృక్షాలు కూలిపోయాయి. ఆశీలమెట్ట వద్ద ఈదురుగాలులకు హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు తెగిపడిపోయాయి. వర్షం తాకిడికి బీచ్‌రోడ్డులో అలల తాకిడి ఉధృతంగా మారింది. బీచ్ రోడ్డులో కురిసిన భారీ వర్షం కారణంగా రోడ్డుపైకి నీరు చేరింది.



బుల్లయ్య కాలేజ్ వద్ద కూలిన చెట్లు

తారస్థాయికి ఏసీబీ విచారణ!

ఒకవైపు నకిలీ ఏసీబీ అధికారి పేరుతో వసూళ్లు.. మరోవైపు సొంత శాఖలో కొద్ది మంది నెలవారీ ముడుపుల రాయుళ్ల కారణంగా విమర్శలు.. ఇలాంటి తరుణంలో ఉమ్మడి విశాఖ జిల్లా అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)కు అసలైన పరీక్ష ఎదురైంది. జిల్లాలోని పెందుర్తి దరి, వేపగుంటలో బినామీ 'రాజు'తో అక్రమ వ్యవహారాలు నడుపుతున్న ఓ సబ్‌రిజిస్ట్రార్ కేసు వచ్చింది. ఇక్కడి ఏసీబీపై నమ్మకం లేకపోవడంతో ఆధారాలతో సహా విజయవాడలోని ఏసీబీ కేంద్ర కార్యాలయానికి ఫిర్యాదు వెళ్లింది. విచారణ 'తార'స్థాయికి చేరాల్సిన తరుణంలో ఈ సమాచారాన్ని లీక్ చేసి, సబ్‌రిజిస్ట్రార్ అప్రమత్తమయ్యేలా సాయపడ్డారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- వేపగుంటలో భారీ వాణిజ్య భవంతి
- పక్కనే 500 గజాల స్థలం
- రూ.కోట్లలో కాజేసిన ఓ సబ్ రిజిస్ట్రార్
- బినామీ 'రాజు'పేరుతో వ్యవహారాలు
- ఆధారాలతో ఏసీబీ ప్రధాన కార్యాలయానికి ఫిర్యాదు
- ముందుగానే లీక్ చేసిన క్షేత్రస్థాయి సిబ్బంది?
- విశాఖ ఏసీబీ పనితనానికి సిసలైన పరీక్ష



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

జిల్లాలోని ఓ సబ్ రిజిస్ట్రార్‌కు వేపగుంటలో భారీ వాణిజ్య భవంతితో పాటు పక్కనే 500 చ.గ.ల ఖాళీ స్థలం ఉందని.. తన బినామీ రాజు పేరుతో అక్రమాలు సాగిస్తున్నాడంటూ ఏసీబీ ప్రధాన కార్యాలయానికి ఫిర్యాదు వెళ్లినట్టు సమాచారం. సదరు సబ్ రిజిస్ట్రార్ నిర్మించిన భారీ వాణిజ్య భవంతి ఫోటోలు, లీజు పేరిట ప్రకటించిన ఫోన్ నెంబర్‌తో పాటు, అతని బినామీ 'రాజు' వ్యవహారాలను కూడా అందించినట్లు తెలిసింది. స్థానిక ఏసీబీ బాస్ ముక్కుసూటిగా వ్యవహరిస్తారనే పేరున్నప్పటికీ... ఇక్కడే పాతుకుపోయిన కొద్ది మంది ఎస్ఐ, ఏఎస్ఐ, కానిస్టేబుళ్ల తీరుతో దర్యాప్తు సందర్భంగా సమస్యలొస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇందుకు ఫిర్యాదుదారు స్థానికంగా ఫిర్యాదు చేయకుండా నేరుగా ప్రధాన కార్యాలయానికి ఫిర్యాదు చేయడమే నిదర్శనం. అయితే, ఈ ఆరోపణల ఆధారంగా లోతైన దర్యాప్తు చేసి... సదరు సబ్ రిజిస్ట్రార్‌ను ఇరికిస్తారో? 'మామూళ్ల'గా కేసు మూసేస్తారో? తేలాల్సి ఉంది.

విషయం లీకైంది?

సబ్‌రిజిస్ట్రార్ రంగ ప్రవేశంతో సాధారణ వ్యక్తులుగా వెళ్లిన ఏసీబీ సిబ్బందికి దిమ్మతిరిగి మైండ్ బ్లాంక్ అయినంత పనైంది. సదరు వాణిజ్య భవనానికి సంబంధించిన వ్యవహారాలన్నీ సబ్ రిజిస్ట్రార్‌కు చెందినవనే విషయం కూడా విచారణ బృందానికి తేటతెల్లమైంది. దీంతోపాటు ఈ వ్యవహారాలన్నీ బినామీ పేర్లతో సాగిస్తున్నారని స్పష్టమైంది. ఈ బినామీలకు ఉన్న లంకె కాస్తా ఏసీబీ అధికారులు ఛేదించాల్సి ఉంది. అయితే, విచారణ బృందంలోని కొందరు ఇప్పటికే సదరు సబ్ రిజిస్ట్రార్‌కు ఉప్పందించారనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదుపై ఎటువంటి నివేదిక ఇక్కడి నుంచి వెళ్తుందో చూడాలి.

రంగంలోకి సబ్‌రిజిస్ట్రార్!

ఇప్పటికే అందిన ఫిర్యాదుపై ఏసీబీ సిబ్బంది సదరు వాణిజ్య భవనాన్ని సందర్శించినట్టు తెలిసింది. అక్కడి నుంచే ఆ భవనం లీజుకు కావాలంటూ ఫోన్ ద్వారా వాకబు చేసినట్టు సమాచారం. లీజు మొత్తంపై ఆరా తీయగా చదరపు అడుగు(ఎస్ఎఫ్‌టీ)కు ఇంత మొత్తం అంటూ సమాధానం వచ్చింది. పార్కింగ్ ఇబ్బంది గురించి సందేహం వ్యక్తం చేస్తే.. తన సార్‌తో మాట్లాడాలంటూ మరో నెంబర్‌ను లీజు వ్యవహారాలు చూస్తున్న బినామీ వ్యక్తి, ఏసీబీ బృందానికి అందించారట. అప్పుడు రంగంలోకి ప్రవేశించారు సదరు సబ్ రిజిస్ట్రార్. పక్కనే ఉన్న 500 చదరపు గజాల స్థలం కూడా తనదేనని, కావాలంటే పార్కింగ్‌కు ఆ స్థలాన్ని వాడుకోవచ్చంటూ స్వయంగా వచ్చి, చూపించినట్లు ప్రచారం జరుగుతోంది.

పదేళ్లు నిండకుండానే.. సంపాదన రూ.100 కోట్లు

వాస్తవానికి సదరు సబ్ రిజిస్ట్రార్ సర్వీసు కాలం చాలా తక్కువే. చేరిన కొత్తలోనే మంచి ఫోకల్ ఏరియాలో పోస్టింగ్ రావడంతో ఆరంభం నుంచే దోపిడీ మొదలెట్టినట్లు సమాచారం. సర్వీసు కాలమంతా కలిపి పదేళ్లలోపు మాత్రమే ఉన్నా.. ఆస్తులు మాత్రం రూ.100 కోట్ల పైనే అని సమాచారం. తన బినామీ రాజుకు... ఈ సబ్ రిజిస్ట్రార్‌కు ఉన్న లింకులన్నీ వెలికితీసే పనిలో ఏసీబీ ఉంది. ఇంత తక్కువ సర్వీసు కాలంలో రూ.100 కోట్ల మేర ఆస్తులను ఎలా కూడబెట్టారనేది ఆయనతో పాటు సర్వీసులో చేరిన వారికీ అర్థం కావట్లేదు.

'తార'లు దిగిరావాల్సిందే!

ప్రధానంగా చిన్న చిన్న సమస్యలు ఉన్న భూముల రిజిస్ట్రేషన్‌తో పాటు సర్వే నెంబర్లను మార్చి రిజిస్ట్రేషన్ చేయడంలో సిద్ధహస్తుడు. ఒకవేళ ఎవరైనా అడిగినంత ఇవ్వకపోతే 'తార'లు దిగిరావాల్సిందేనని 'పేరు'. తన కార్యాలయంలో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు ప్రతి కదలికనూ రికార్డు చేసేలా జాగ్రత్తలు తీసుకుంటాడు. అవసరమైన సమయంలో ఆ రికార్డులతోనే ఎదుటివారిని బెదిరించడంలో ఘనాపాటి. ఈ నేపథ్యంలోనే తమ పనికానిచ్చుకునేందుకు అడిగినంత ముట్టజెప్పుకుని బాధితులు మిన్నకుండిపోతున్నారని తెలుస్తోంది. మొత్తంగా ఇప్పటికే అనేక ఆరోపణలతో పరువుపోతున్న విశాఖ ఏసీబీ పనితనానికి ఈ కేసు లిట్మస్ పరీక్షగా మారనుందనడంలో సందేహం లేదు.

విద్వేషం.. విధ్వంసం

కూటమి ఏడాది పాలనలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు, దౌర్జన్యాలు

ఉమ్మడి విశాఖ జిల్లాలో 100 మందిపై కేసులు, ఇద్దరిపై హత్యాయత్నం



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన మరుక్షణం నుంచే కూటమి నేతలు, కార్యకర్తలు దాడులు, హత్యలు, దౌర్జన్యాలతో చెలరేగిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సానుభూతిపరులే లక్ష్యంగా తీవ్ర స్థాయిలో వేధింపులకు పాల్పడుతున్నారు. రెడ్‌బుక్ పేరుతో టీడీపీ నేతలు, కార్యకర్తల దౌర్జన్యకాండకు హద్దుల్లేకుండా పోయింది. భౌతికదాడులు, ఆస్తుల విధ్వంసం విచ్చలవిడిగా కొనసాగుతోంది. ప్రశాంతతకు మారుపేరైన ఉమ్మడి విశాఖ జిల్లాలోని పల్లెల్లో వ్యక్తిగత విద్వేషాలు, దాడులు, అడ్డగోలు కేసులు, అరెస్టులు పెచ్చుమీరిపోయాయి.

8లో



ఏడాది పాలన అంతులేని వేదన

భారత నావికాదళానికి మరింత బలం

త్వరలో 9-10 కొత్త యుద్ధనౌకలు



ఏయూక్యాంపస్: భారత నావికాదళం తన సంపత్తిని మరింత పెంచుకోనుంది. ఈ ఏడాది జూన్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో 9 నుంచి 10 కొత్త యుద్ధనౌకలు భారత నావికాదళంలో చేరనున్నాయి. దీంతో నౌకాదళం తన శక్తిని గణనీయంగా విస్తరించనుంది. ఈ నూతన చేర్పులలో భాగంగా, యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ యుద్ధనౌక 'అర్నాలా' ను జూన్ 18న విశాఖలోని నేవల్ డాక్‌యార్డ్‌లో కమిషన్ చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇది నావికాదళం బలాన్ని మరింతగా వృద్ధి చేస్తుంది. త్వరలో కమిషన్ చేయనున్న ఈ యుద్ధనౌకలలో ఎక్కువ భాగం దేశీయంగా తయారు చేసినవేనని అధికారులు తెలిపారు. కమీషనింగ్ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూ- ఎస్‌డబ్ల్యూసీ విభాగానికి చెందిన మరిన్ని నౌకలు కూడా ఉంటాయని, విశాఖపట్నం నుంచే 'అర్నాలా' తో పాటు మరికొన్ని ఏఎస్‌డబ్ల్యూ- ఎస్‌డబ్ల్యూసీ రకం యుద్ధనౌకలు కమిషన్ చేయబడతాయని పేర్కొన్నారు.

'నారా' పాలనలో నేరాలెన్నో..

- కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళలపై పెచ్చుమీరిన దాడులు
- ఇంత జరుగుతున్న బాబు, పవన్ స్పందించరా?
- హోం మంత్రి ఉన్నట్టా? లేనట్టా??
- కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తిన వైఎస్సార్ సీపీ మహిళా విభాగం
- బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేత



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఈర్లె అనురాధ తదితరులు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు

డాబాగార్డెన్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో మహిళలు, బాలికలపై దాడులు, లైంగిక దాడులు పెరిగాయని, శాంతిభద్రతలు క్షీణించాయని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఆరోపించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించకపోవడం సిగ్గుచేటని ధ్వజమెత్తింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు సూచనలతో ఈ నిరసనను చేపట్టారు. బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి, విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. 'నారా పాలనలో మహిళల ఆక్రందనలు.. ఆడబిడ్డలపై అఘాయిత్యాలు.. బాబు పాలనలో రక్షణ లేదు.. భిక్షణే', 'నేరగాళ్ల చేతిలో ఆడబిడ్డల భవిత', 'కక్షల్లో ప్రభుత్వం-పోలీసులు', 'మంటల్లో శాంతి భద్రతలు', 'రోజుకో అఘాయిత్యం, గంటకో నేరం', 'ఆడబిడ్డలకు లేదు రక్షణ', 'బాబు వచ్చాడు, దిశ తీసేశాడు' అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళల భద్రతను గాలికి వదిలేసిందని విమర్శించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని, హోంమంత్రి అనిత మహిళ అయి ఉండి కూడా మహిళలకు రక్షణ కల్పించలేకపోతున్నారని ఆమె దుయ్యబట్టారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మహిళలకు అన్యాయం జరుగుతుందని విమర్శించిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు ఇప్పుడు జరుగుతున్న దాడులు కనిపించడం లేదా అని ఆమె ప్రశ్నించారు. హోంమంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళల రక్షణకు పెద్ద పీట వేశారని, దిశ చట్టాన్ని అమలు చేసి భద్రత కల్పించారని గుర్తు చేశారు. మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ గత ఏడాదిగా మహిళలు, బాలికలపై దాడులు, లైంగికదాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు పూర్తి రక్షణ ఉండేదని గుర్తు చేస్తూ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, అందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకురాలు ఈర్లె అనురాధ మాట్లాడుతూ, రాష్ట్రంలో అనేక లైంగికదాడులు జరుగుతున్నాయని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన మాటలు ఏమయ్యాయని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను ప్రశ్నించారు. కార్యక్రమంలో పల్లా చిన్నతల్లి, నాగ శశికళ, చుక్క వరలక్ష్మి, రీసు అనురాధ, బి.విజయలక్ష్మి, రామలక్ష్మి, పప్పల సునీత, శ్రీదేవివర్మ, బి.పద్మావతి, బయ్యవరపు రాధ, సత్యాల సాగరిక, రాజేశ్వరి, మాసిన లక్ష్మి, నాగమణి, ఈశ్వరి, శిరీష, విశాలక్ష్మి, సలాది భాను, మళ్ల ధనలత, పత్తివాడ కనక, మజ్జి జ్యోతి, రమణమ్మ, సత్యవతి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. మహిళల నిరసనకు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, పార్టీ నాయకులు గొలగాని శ్రీనివాస్, దొడ్డి బాపూ ఆనంద్, పీతల వాసు, ముత్తాబత్తుల రమేష్, పచ్చిరపల్లి రాము పలువురు నాయకులు, కార్యకర్తలు సంఘీభావం తెలిపారు.

ఉపాధ్యాయ కౌన్సెలింగ్ గందరగోళం

- ఇబ్బంది పడ్డ ఉపాధ్యాయులు
- కనీస ఏర్పాట్ల కరవు
- అధికారులను నిలదీసిన టీచర్లు
- సాంకేతిక లోపం అంటూ నేటికి కౌన్సెలింగ్ వాయిదా



అధికారులతో ఉపాధ్యాయుల వాగ్వాదం



ఇబ్బందులపై నిరసన వ్యక్తం చేస్తున్న సుదూర ప్రాంత ఉపాధ్యాయులు

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాల సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జీటీ) బదిలీలకు సంబంధించి మంగళవారం నిర్వహించాల్సిన మాన్యువల్ కౌన్సెలింగ్ గందరగోళంగా మారింది. కొన్ని రోజులుగా ధర్నాలు, నిరసనలతో తమ సమస్యలను వినిపించిన ఎస్‌జీటీలకు కౌన్సెలింగ్ ప్రక్రియ తీవ్ర అసౌకర్యాన్ని కలిగించింది. విద్యాశాఖ అధికారులు సరైన సౌకర్యాలు కల్పించకపోవడం, కౌన్సెలింగ్‌లో తీవ్ర జాప్యం జరగడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన ఈ కౌన్సెలింగ్‌కు అర్హులైన 1 నుంచి 500 మంది ఉపాధ్యాయులను పిలవగా, వారంతా మధ్యాహ్నం 2 గంటలకే హాజరయ్యారు. అయితే కౌన్సెలింగ్ ప్రక్రియ గంటల తరబడి ఆలస్యమవుతూ వచ్చింది. దీంతో సహనం కోల్పోయిన ఉపాధ్యాయుల్లో గందరగోళం నెలకొంది. అధికారులను నిలదీశారు. కౌన్సెలింగ్ జరుపుతారా లేదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు సాంకేతిక లోపం తలెత్తిందని పేర్కొంటూ కౌన్సెలింగ్‌ను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు రాత్రి 9 గంటలకు ప్రకటించారు. అప్పటి వరకు నిరీక్షించిన ఉపాధ్యాయులు ఈ ప్రకటనతో తీవ్ర నిరాశకు గురయ్యారు. కనీసం హాజరైన ఉపాధ్యాయులకు కూర్చోవడానికి కుర్చీలు కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. దూర ప్రాంతాల నుంచి చంటి పిల్లలతో సహా హాజరైన కొందరు ఉపాధ్యాయులు రాత్రివేళ తీవ్ర అవస్థలు పడ్డారు. నగరానికి దగ్గరగా ఉన్నవారు ఇళ్లకు చేరుకోగా, దూర ప్రాంతాల నుంచి వచ్చినవారు వసతి కోసం లాడ్జీలను వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బుధవారం ఉదయం 9 గంటలకు 1 నుంచి 300 మందికి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అధికారులు ప్రకటించారు. అయితే విద్యా శాఖ అధికారులు కావాలనే ఇబ్బంది పెడుతున్నారంటూ ఉపాధ్యాయుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. బుధవారం జరగాల్సిన కౌన్సెలింగ్ అయినా సక్రమంగా జరుపుతారో లేదో అని ఆందోళన వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులు నిరాశతో వెనుదిరిగారు.

ప్రపంచ రికార్డు లక్ష్యంగా యోగా దినోత్సవం

- రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి
- అధికారులతో రాష్ట్ర మంత్రి లోకేష్ సమీక్ష



మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు

మహారాణిపేట: ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం ప్రపంచ రికార్డు సృష్టించేందుకు సిద్ధమవుతోంది. ఒకే ప్రాంతంలో ఐదు లక్షల మందితో యోగా నిర్వహించడమే లక్ష్యమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఆంధ్రా యూనివర్సిటీలోని సాగరిక కన్వెన్షన్ హాలులో యోగా డే నిర్వహణ ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకానున్నారన్నారు. ప్రధాని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని అధికారులు పట్టుదల, క్రమశిక్షణతో విజయవంతం చేయాలని కోరారు. ఇది రాష్ట్ర ప్రజలందరి కార్యక్రమమని, రాజకీయాలకు అతీతంగా అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జూన్ 21న ఆర్.కె. బీచ్ నుంచి భీమిలి వరకు 26 కిలోమీటర్ల పొడవునా 247 కంపార్ట్‌మెంట్లలో యోగా కార్యక్రమం జరగనుంది. ఉదయం 6:30 గంటలకు ప్రధాని మోదీ ప్రధాన ప్రాంగణానికి చేరుకుంటారని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రవాణా సౌకర్యాలు కల్పించాలని మంత్రి ఆదేశించారు. హాజరయ్యే ప్రతి ఒక్కరికీ యోగా మ్యాట్, కిట్, వాటర్ బాటిల్ అందజేయాలన్నారు. మొత్తం 108 పర్యాటక ప్రాంతాల్లో యోగా నిర్వహించనున్నట్లు హోం మంత్రి అనిత తెలిపారు. రాష్ట్ర స్థాయి నోడల్ ఆఫీసర్ ఎం.టి. కృష్ణబాబు మాట్లాడుతూ ప్రతి కంపార్ట్‌మెంట్‌కు ఒక గెజిటెడ్ అధికారిని నియమించామని, క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిని మాత్రమే అనుమతిస్తామని చెప్పారు. రవాణా నియంత్రణకు కమాండ్ కంట్రోల్ రూమ్, 1200 కెమెరాలు ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం 3,500 ఆర్టీసీ బస్సులు, 8 వేల ప్రైవేటు బస్సులు సిద్ధం చేశామని తెలిపారు. భద్రత కోసం 116 అంబులెన్స్‌లు, 1400 బయో టాయ్‌లెట్లు అందుబాటులో ఉంచుతున్నారు. సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, రాష్ట్రమంత్రులు అనగాని సత్యప్రసాద్, గుమ్మడి సంధ్యారాణి, కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, డీఐజీ గోపినాథ్ జెట్టి, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎల్ఎల్‌సిలు, కార్పొరేషన్ చైర్మన్లు, రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కూటమి నేతల 'దొంగాట' 8లో

ఉచిత కార్పొరేట్ విద్యకు మంగళం 8లో

విద్వేషం.. విధ్వంసం

- 11 మంది సోషల్ మీడియా యాక్టివిస్టులపై 44 అక్రమ కేసులు
- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల పంట నాశనం.. ఇళ్లు ధ్వంసం
- ఇసుక దోపిడీని అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే పెట్ల గణేష్‌తోపాటు 44 మందిపై కేసులు



ఇసుక దోపిడీని అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర గణేష్‌పై పోలీసుల రుబాబు



ఏడాది పాలన అంతులేని వేదన

సాక్షి, విశాఖపట్నం: హామీలు గాలికొదిలేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల వేధింపులే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారు. ఆస్తులు విధ్వంసమైనా, ప్రాణాల మీదకు వచ్చినా.. ప్రతిపక్షం నుంచి వచ్చిన ఫిర్యాదు అంటే పోలీసులు పట్టించుకోవడం మానేశారు. ఏడాది కూటమి పాలనలో ఉమ్మడి విశాఖ జిల్లాలో 100 మందిపై కేసులు నమోదు చేశారు. ఇద్దరిపై హత్యాయత్నం చేశారు. 11 మంది సోషల్ మీడియా యాక్టివిస్టులపై 44 అక్రమ కేసులు పెట్టారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల పంటలు, ఇళ్లు ధ్వంసం చేశారు.

స్పీకర్ ఇలాకాలో దాడులు, దౌర్జన్యాలు..

సాక్షాత్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడి నియోజకవర్గమైన నర్సీపట్నంలో దాడులు, దౌర్జన్యాలు, హత్యాయత్నాలు ఎక్కువగా జరిగాయి. నియోజకవర్గంలో ఇసుక దోపిడీని అడ్డుకున్నందుకుగానూ మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌తోపాటు 44 మందిపై అక్రమ కేసులు బనాయించారు. కొద్ది రోజుల క్రితం వైఎస్సార్‌సీపీ యూత్ లీడర్ అల్లంపల్లి ఈశ్వరరావుపై రౌడీలతో హత్యకు యత్నించారు. ఆయన అతి కష్టం మీద ప్రాణాలు దక్కించుకున్నారు. చిటెకెల కన్నపై కేసు నమోదు చేసి ఆయన ఇళ్లను కూల్చేశారు. వైబీ పట్నానికి చెందిన చుక్కా రాంబాబుపై దాడి చేశారు. చీడిగొమ్మల గ్రామంలో టీడీపీ నేతలు దాడి చేయగా, 12 మంది వైఎస్సార్ సీపీ యువతపై కేసులు నమోదు చేశారు. జూలై 9వ తేదీన మాకవరపాలెం మండలం రాశిపల్లి శివారు ఎరకన్నపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్ కొల్లి అప్పలనాయుడుపై 50 మందికి పైగా టీడీపీ గూండాలు కర్రలతో దాడి చేశారు. దాడిని అడ్డుకునేందుకు వెళ్లిన అతని తమ్ముడు రామారావు, తల్లిదండ్రులపై కూడా కర్రలతో దాడి చేశారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని మాకవరపాలెంలోని టీడీపీ కార్యకర్త లక్ష్మణ్‌ను వైఎస్సార్‌సీపీ నేతలు మందలించారు. ఈ వీడియోను ఇటీవల ఒక టీడీపీ నేత ట్విట్టర్‌లో పెట్టి వైఎస్సార్‌సీపీ నేతలు రుత్తల సత్యనారాయణ, సర్పంచ్‌లు బొడ్డు గోవిందరావు, మాకిరెడ్డి అయ్యప్ప, పార్టీ నేత బండారు గాంధీపై అక్రమ కేసులు పెట్టి అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై న్యాయస్థానం మొట్టికాయలు పెట్టడంతో తోక ముడిచారు.

హోంమంత్రి ఇలాకాలో..

పాయకరావుపేట నియోజకవర్గం కోటవురట్ల గ్రామం శివారు మర్రిచెట్టు ప్రాంతంలో మాడెం వరలక్ష్మి ఇంటి ముందు స్థలాన్ని ఆక్రమించేందుకు టీడీపీకి చెందిన జవ్వాది ఈశ్వరరావు, జవ్వాది రమేష్, బత్తుల అప్పారావు, బత్తుల నరసింహమూర్తి, పబ్బు తుర్రయ్య దాడి చేశారు. మహిళల దుస్తులు చింపి అసభ్యకరంగా దూషించారు. దాడి చేయడమే కాకుండా బాధిత మహిళలపై టీడీపీ వారు కేసులు కూడా పెట్టారు.

సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులు

➡ విశాఖ తూర్పు నియోజకవర్గం మద్దిలపాలేనికి చెందిన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ బోస రమణారెడ్డిపై వివిధ జిల్లాల్లోని పాదిలి, దర్శి, ఇచ్ఛాపురం, నీలకంఠాపురం, పార్వతీపురం పోలీస్‌స్టేషన్లలో ఆరు కేసులు నమోదు చేశారు. ఒక స్టేషన్ తర్వాత మరో స్టేషన్‌కు తిప్పి తీవ్రంగా వేధించారు. ఆయన డిసెంబర్ నెలలో విడుదలయ్యారు.

➡ విశాఖ జిల్లా గాజువాక మండలం గొల్లజగ్గరాజుపేటలో నివాసముంటున్న బోడి వెంకటేష్ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌లపై అభ్యంతరకర పోస్టులు పెట్టారంటూ మొత్తం 17 కేసులు నమోదు చేశారు. ఆయనను తొలుత 2024 నవంబర్ 3న అరెస్టు చేశారు. మొత్తం 115 రోజుల పాటు రిమాండ్‌లో ఉన్నారు. బాపట్ల జిల్లా మార్టూరు స్టేషన్‌లో సీఐ సీహెచ్ శేషగిరిరావు 15 నిమిషాల్లో 4 వేల గుంజీలు తీయాలంటూ ఇబ్బంది పెట్టారు. రాజాం, చినమేరంగి (కురుపాం), విశాఖలో దువ్వాడ, టూటౌన్, పరవాడ, సబ్బవరం, మహారాణిపేట, రేపల్లె, పెదకూరపాడు, పాతగుంటూరు, కృష్ణపట్నం, చీరాల, మార్టూరు, గుంటూరు, బాపట్ల, లావేరు, కర్నూల్, కడప, విజయవాడ, మైలవరం, మంచిలీపట్నంలలో కేసులు నమోదు చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లిలో కండిషన్ బెయిల్ మంజూరు చేశారు. ఈ కేసులో మరో ముగ్గురు సోషల్ మీడియా యాక్టివిస్టులు ప్రసాద్ సిద్దు, గోపిరాజు వంకా, సదరం జ్ఞానేష్‌లపై మార్టూరు పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేసి స్టేషన్ బెయిల్ ఇచ్చారు.

➡ విశాఖకు చెందిన సోషల్ మీడియా కార్యకర్త ఇంటూరి రవికిరణ్‌పై విశాఖలోనే కాకుండా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో మొత్తం 21 కేసులు నమోదు చేశారు. కేసులు, విచారణ అంటూ రెండు నెలలు పోలీసులు చిత్రహింసలకు గురిచేశారు. మొదట 2024 ఆగస్టు 31న పోలీసులు అరెస్టు చేశారు. అతని కుటుంబ సభ్యులు హైకోర్టుకు వెళ్లడంతో బెయిల్ లభించింది. మళ్లీ 2024 నవంబర్‌లో కొత్త కేసులు పెట్టి అరెస్టు చేశారు. విశాఖ సెంట్రల్ జైల్‌లో రిమాండ్‌లో ఉన్న సమయంలో బాపట్లలో కూడా మరో కేసు నమోదు చేశారు. దీంతో జైలు నుంచి నేరుగా బాపట్లకు తీసుకువెళ్లి విచారించారు. ఇలా అతనిపై రాష్ట్రంలో అనేక జిల్లాల్లో కేసులు పెట్టి వేధింపులకు గురిచేశారు. ప్రస్తుతం బెయిల్ మంజూరు చేశారు.

ఉచిత కార్పొరేట్ విద్యకు మంగళం

విద్యా హక్కు చట్టం(ఆర్‌టీఈ)లో భాగంగా పేద పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో అందించాల్సిన 25 శాతం సీట్లకు యాజమాన్యాలు మంగళం పాడుతున్నాయి. ఉచిత సీట్లు ఇవ్వలేమని తల్లిదండ్రులకు తెగేసి చెప్పేస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలైన ఈ విధానం, ఇప్పుడెందుకు అమలు చేయట్లేదంటూ తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

- ప్రైవేట్ పాఠశాల్లో పేద పిల్లలకు సీట్లు కేటాయించని యాజమాన్యాలు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు



ఆరిలోవ: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్‌టీఈ కింద ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఫీజు లేకుండా ఉచితంగా కేటాయించే వెసులుబాటు కల్పించింది. ప్రతి పాఠశాల యాజమాన్యం వారి పాఠశాలకు 3 కిలోమీటర్ల పరిధిలో ఉన్న పిల్లలకు ఒకటో తరగతిలో నాలుగో వంతు సీట్లు కేటాయించాలి. ఉచితంగా చేర్చుకున్న విద్యార్థుల ఫీజుల్ని ఆయా పాఠశాలలకు ప్రభుత్వమే చెల్లించేది. పట్టణ ప్రాంతాల పాఠశాలలకు ఏడాదికి ఒక్కో విద్యార్థికి రూ.16 వేలు, గ్రామీణ ప్రాంతాల్లోనైతే రూ.8 వేలు చెల్లించేది. ప్రస్తుతం రెండేళ్లుగా అలాంటి విద్యార్థులకు సంబంధించిన ఫీజులు బకాయిలు ఉండిపోయాయనే నెపంతో కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పిల్లల్ని ఈ ఏడాది చేర్చుకోవడంలేదు.

చేర్చుకోలేమని తెగేసి చెప్తున్నారు

తమకు బకాయిలు ఏళ్ల తరబడి ఉన్నాయని, అందుకే మీ పిల్లల్ని మా పాఠశాలలో చేర్చుకోబోమంటూ కొన్ని యాజమాన్యాలు తెగేసి చెప్తున్నాయి. ఉచిత సీటుకు ప్రభుత్వం ఇచ్చే డబ్బులు తక్కువ కావడం వల్లే ప్రైవేట్ పాఠశాలలు తప్పించుకుంటున్నాయనే విమర్శలున్నాయి. ఏడాదికి నగరంలోని కొన్ని యాజమాన్యాలు ఒకటో తరగతి విద్యార్థికే రూ.లక్ష వరకు ఫీజులు వసూలు చేస్తున్నాయి. అలాంటపుడు రూ.16 వేలకే సీటిచ్చి లాభాలు కోల్పోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నాయి.

గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

యాజమాన్యాల తీరుతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఎంత బ్రతిమాలినా పాఠశాలల యాజమాన్యాలు అంగీకరించకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు సోమవారం గ్రీవెన్స్‌లో కొందరు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. తమ పిల్లల్ని సీతమ్మధారలో ఉన్న 'ది ప్రెసిడెన్షియల్ స్కూల్'లో ఆర్‌టీఈ కింద చేర్చుకోవడంలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే పరిస్థితి నగరంతో పాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఉండటంతో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత సీట్లు ఇవ్వలేమన్నారు

మేం సీతమ్మధార ప్రాంతంలో నివాసం ఉంటున్నాం. ఇక్కడున్న ది ప్రెసిడెన్షియల్ స్కూల్‌కు మా ఇంటి నుంచి కిలో మీటర్ మాత్రమే దూరం. ఈ దూరాన్ని బట్టి మొదటి ప్రాధాన్యతలో మా పిల్లలకు ఆ పాఠశాలలో సీట్లు ఇవ్వాలి. ఆర్‌టీఈ సీట్లు కోసం అవసరమైన పత్రాలు అందించాం. కానీ మాకు ప్రభుత్వం నుంచి బకాయిలు ఉన్నాయని, మేం మీ పిల్లలకు సీట్లు ఇవ్వలేమని చెప్పారు. ఎవరికైనా ఫిర్యాదు చేసుకోండి అని ఆ పాఠశాల నిర్వాహకులు అన్నారు. దీంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. కలెక్టర్ మా పిల్లలకు న్యాయం చేయాలని, ఆ పాఠశాలలో ఆర్‌టీఈ సీట్లు కేటాయించాలని కోరుతున్నాం.

–బి.సంతోష్, సీహెచ్.ధనలక్ష్మి, ఎస్.దేవి, డి.లక్ష్మీప్రసన్న, సీహెచ్ యశోదకృష్ణ

పెట్టుబడిదారుల విశ్వాసం పొందాం

ఎఫ్‌ఏపీసీసీఐ ఎక్స్‌లెన్స్ అవార్డుల కార్యక్రమంలో పరిశ్రమల మంత్రి టీజీ భరత్



అవార్డులు ప్రదానం చేస్తున్న మంత్రి టి.జి భరత్

ఏయూ క్యాంపస్: రాష్ట్రంలో జాతీయ, అంతర్జాతీయ సంస్థల విశ్వాసాన్ని ప్రభుత్వం పొందిందని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టి.జి.భరత్ అన్నారు. గత ఏడాది రూ.9.2 లక్షల కోట్ల పెట్టుబడులకు ప్రతిపాదనలు వచ్చాయని, అమరావతి నిర్మాణానికి రూ.60 వేల కోట్లతో టెండర్లు పిలిచామని తెలిపారు. ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ విశాఖలో మౌలిక వసతుల అభివృద్ధికి రూ.500 కోట్ల ప్రాజెక్టులు ప్రకటించామని, డబుల్ డెక్కర్ మెట్రోకు డీపీఆర్ సిద్ధమైందని వెల్లడించారు. ఎఫ్ఏపీసీసీఐ అధ్యక్షుడు కంకటాల మల్లిక్, టూరిజం ఆధారిత ప్రాజెక్టులకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను ప్రశంసించారు. ఈ సందర్భంగా 11 విభాగాల్లో ఎఫ్ఏపీసీసీఐ ఎక్స్‌లెన్స్ అవార్డులు ప్రదానం చేశారు.

నయన మనోహరం.. వెంకన్న నౌకా విహారం

ఘనంగా పోర్టు వేంకటేశ్వరస్వామి తెప్పోత్సవం



తెప్పోత్సవంలో స్వామి వెంట వేరే నౌకలో వెళ్తున్న భక్తులు

డాబాగార్డెన్స్: నిత్యం పాలకడలిలో పవళించి ముల్లోకాలను బ్రోచే నారాయణుడు వేంకటేశుడై జలధిలో విహరించిన మనోహర దృశ్యం సాగరతీరంలో ఆవిష్కృతమైంది. ఈ దివ్య ఘట్టాన్ని తిలకించి భక్తజనకోటి మురిసింది. పోర్టు ప్రాంతంలోని శృంగమణి పర్వతంపై ఉన్న వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం సాయంత్రం తెప్పోత్సవం ఘనంగా సాగింది. ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన హోమాలు, బలిహరణం, తీర్థగోష్ఠి జరిపారు. సాయంత్రం 4 గంటలకు స్వామి వారి ఉత్సవ ప్రతిమలను పల్లకిలో మెట్లమార్గం మీదుగా కిందికి తీసుకొచ్చారు. అనంతరం దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు, పలువురు ప్రముఖులు స్వామివారి పల్లకిని మేళతాళాలు, అర్చకస్వాముల వేదమంత్రాల నడుమ తెప్పోత్సవానికి సిద్ధంగా ఉన్న నౌక వరకూ మోసుకెళ్లారు. శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించిన నౌక మీదకు తీసుకెళ్లారు. భక్తులు ప్రయాణించే లాంచీలు అనుసరించగా స్వామి కాసేపు తెప్పపై సాగర విహారం చేశారు. అనంతరం స్వామిని తిరిగి ఆలయానికి తీసుకువెళ్లారు. ఆనందోత్సాహాల నడుమ జరిగిన ఈ తెప్పోత్సవం భక్తులను పరవశింపజేసింది. నౌకా విహారంలో ఆలయ ఈవో శ్రీనివాస్, ప్రధానాచార్యులు శ్రీనివాస జగన్నాథాచార్యులు, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు

వార్షిక తిరు కల్యాణోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం 8 నుంచి 11 వరకు పూర్ణాహుతి, చూర్ణోత్సవం, సముద్రస్నానం(చక్రస్నానం), సాయంత్రం 6 గంటలకు ఆరాధన చూర్ణోత్సవం (దొంగల దోపు ఉత్సవం), ధ్వజావరోహణం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వాల్తేర్ లోకోకు రెండో స్థానం



లోకో పోటీల్లో 2వ స్థానం పొందిన ఎలక్ట్రికల్ లోకో షెడ్ సిబ్బందితో డీఆర్‌ఎం లలిత్ బోరా

తాటిచెట్లపాలెం: ఇటీవల బనారస్ లోకోమోటివ్ వర్క్స్‌లో నిర్వహించిన 'బ్యూటీ కాంటెస్ట్ ఫర్ ఎలక్ట్రికల్ లోకోమోటివ్స్' పోటీలలో విశాఖ ఎలక్ట్రికల్ లోకో షెడ్‌కు ద్వితీయ స్థానం లభించింది. వాల్తేరు డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా నేతృత్వంలో సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ బి.షణ్ముఖరావు పర్యవేక్షణలో విశాఖ ఎలక్ట్రికల్ లోకో షెడ్ సిబ్బంది ఈ విజయాన్ని సాధించారు. డబ్ల్యూ ఏపీ -7 లోకోమోటివ్ 37419 ను ఆధునీకరించి, అధునాతన సౌకర్యాలు, మార్పులతో ఈ పోటీల్లో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 13 లోకోలు పాల్గొనగా విశాఖ లోకోకు రెండో స్థానం దక్కింది. ఈ సందర్భంగా వాల్తేరు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా ఎలక్ట్రికల్ లోకో షెడ్ సిబ్బందిని, అధికారులను అభినందించారు.

మమ్మేలు మాతల్లి.. గంగమ్మ తల్లి

ప్రకృతి విపత్తుల నుంచి రక్షణ కోరుతూ మత్స్యకారుల పూజలు



గంగమ్మజాతర సందర్భంగా ఫిషింగ్ హార్బర్ వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న మత్స్యకారులు

మహారాణిపేట: ప్రకృతి విపత్తుల నుంచి నుంచి మత్స్యకారులను, వారి బోట్లు, వేట సామగ్రిని రక్షించాలని కోరుతూ ఫిషింగ్ హార్బర్ ఆవరణలో గంగమ్మ తల్లికి మత్స్యకారులు మంగళవారం విశేష పూజలు జరిపారు. గంగమ్మతల్లితోపాటు సముద్రుడికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ నెల 14న అర్ధరాత్రి దాటాక బోట్లు చేపల వేటకు వెళ్లనున్న నేపథ్యంలో ఈ పండగను ఘనంగా నిర్వహించారు. ఏపీ మరపడవల సంఘం అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు దంపతులు గంగమ్మ తల్లికి పసుపు కుంకుమలు, ఇతర పూజా ద్రవ్యాలు సమర్పించారు. కార్యక్రమంలో మరపడవల సంఘం గౌరవ అధ్యక్షుడు పీసీ అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఎస్.నర్సింగరావు, కార్యదర్శి మున్నం బాలాజీ, నాయకులు గరికిన పరుశురాముడు, ఎస్ రాము, గరగయ్య, జి.రాజేష్, పుక్కళ్ల ఈశ్వరరావు, ఎ.చిన్న, పెద్ద, మహిళలు, మత్స్యకారులు పాల్గొన్నారు

కోలాహలంగా హార్బర్ ప్రాంతం

గంగమ్మతల్లి పూజలతో హార్బర్ ప్రాంతంలో సందడి నెలకొంది. గంగమ్మ తల్లి ఆలయ వ్యవస్థాపక పూజారి శర్మ పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి వర్షం పడుతున్నప్పటికి భక్తులు వెరవకుండా గంగమ్మకు ప్రార్థనలు చేశారు. తమను, తమ కుటుంబాలను చల్లగా చూడాలని కోరుకుంటూ కోళ్లు, మేకలు, గొర్రెలు తీసుకొచ్చి మొక్కులు చెల్లించారు. హార్బర్‌లో వేంచేసిన గంగమ్మ తల్లి ఆలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పూజలు నిర్వహించారు.

గంజాయి కేసులో పదేళ్ల జైలు శిక్ష

తాటిచెట్లపాలెం: గవర్నమెంట్ రైల్వే పోలీసు(జీఆర్పీ)ల తనిఖీల్లో అరెస్టయిన గంజాయి అక్రమ రవాణా కేసులో ప్రధాన నిందితుడికి విశాఖపట్నం మెట్రో పాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టు శిక్ష విధించింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. 2014లో గంజాయితో పట్టుబడ్డ ప్రధాన నిందితుడు కొర్ర ప్రశాంతకుమార్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధించారు. కేసును ప్రభుత్వ న్యాయవాది జీఎస్ఎన్‌వీ ప్రసాద్ నేతృత్వంలో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు, కోర్టు హెడ్ కానిస్టేబుల్ జి.వెంకటేశ్వరరావు నిరంతర పర్యవేక్షణలో బలమైన ఆధారాలు సమర్పించడంతో న్యాయస్థానం నిందితుడికి శిక్ష విధించింది.

కూటమి నేతల 'దొంగాట'

- ఇప్పిలివానిపాలెంలో ఓ ఇంట్లో పది తులాల బంగారం చోరీ
- నిందితుడ్ని విడిచిపెట్టాలని ఒకరు, కేసు కట్టొద్దని మరొకరు హుకుం
- దీంతో చోరీ జరిగిన 12 గంటల్లోనే కేసును 'సుఖాంతం' చేసిన ఖాకీలు



చింతగట్లలో గ్రామస్తులతో మాట్లాడుతున్న క్రైం పోలీసులు

పెందుర్తి: మండలంలోని చింతగట్ల పంచాయతీ ఇప్పిలివానిపాలెంలో గొంప ఆనంద్ ఇంట్లో పది తులాల బంగారం, కొంత వెండి, కాస్త నగదు సోమవారం రాత్రి 10.30 సమయంలో చోరీకి గురైంది. బాధితులు పెందుర్తి పోలీసులను ఆశ్రయించారు. వెంటనే రంగంలోని దిగిన వెస్ట్ జోన్ క్రైం విభాగం సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ డి.సూరిబాబు ఆధ్వర్యంలో విచారణ ముమ్మరం చేసి బాధితులు చెప్పిన ప్రకారం అనుమానితుడ్ని అదుపులోకి తీసుకుని విచారించారు. మంగళవారం ఉదయం 11 గంటలకు మళ్లీ పోలీసులు గ్రామానికి వచ్చి, బాధితులతో మాట్లాడారు. మీ సొత్తు ఎక్కడికీ పోదు, బాగా వెతకండి అంటూ సముదాయించారు. పోలీసులు ఆ మాట చెప్పిన కొద్ది సేపటికే చోరీకి గురైన సొత్తు అంతా దొరికేసింది. గ్రామాల్లో జరుగుతున్న నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ డి.సూరిబాబు ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. అయితే ఆ కాస్త సమయంలో తెరవెనుక జరిగిన విషయాలే.. కూటమి నేతల తీరును తేటతెల్లం చేశాయి.

12 గంటల్లో కథ సుఖాంతం: చోరీ అనుమానితుడ్ని పోలీసులు విచారిస్తున్న సమయంలో కూటమికి చెందిన 'ప్రధాన నేత'నుంచి ఫోన్. అతడ్ని వదిలేయండి. చోరీ సొత్తు ఏదోలా బాధితులకు అందేటట్లు చూడండి. కేసులు గట్రా లేకుండా చేయండి.. అంటూ స్పష్టమైన ఆదేశాలు. ఆ మేరకు గ్రామంలోకి వెళ్లిన పోలీసులు బంగారం ఫలానా చోట ఉండే అవకాశం ఉంది. వెతకండి అంటూ సూచనలిచ్చారు. అప్పటికే పలుమార్లు ఆ ప్రాంతంలో వెతికిన గ్రామస్తులకు అక్కడేం దొరకలేదు. పోలీసులు చెప్పాక మరోసారి ప్రయత్నించగా ఆశ్చర్యం.. దాదాపు పోలీసులు చెప్పిన చోటే బంగారం దొరికేసింది. అయితే నిబంధనల మేరకు కేసు కట్టి, కోర్టు ద్వారా బంగారాన్ని బాధితులకు అందించాలి కదా..! అప్పుడే మరో ముఖ్య నేత ఫోన్. కేసు లేదు.. గాడిద గుడ్డూ లేదూ.. దొరికిన బంగారాన్ని బాధితులకు ఇచ్చేయండంతే.. అని ఆదేశాలు. కూటమి.. పోలీస్.. దొంగాట వ్యవహారం మొత్తం 12 గంటల వ్యవధిలోనే ముగియడం గమనార్హం.

వర్షాలతో ఈపీడీసీఎల్ అప్రమత్తం



కంట్రోల్ రూమ్ నంబర్లు:
కార్పొరేట్ ఆఫీస్ 1912
విశాఖపట్నం 7382299975

విశాఖ సిటీ: భారత వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో, ఏపీఈపీడీసీఎల్ అప్రమత్తమైంది. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు సంస్థ వెల్లడించింది. ఈ మేరకు సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి అధికారులను అప్రమత్తం చేశారు. ఆయన ఆదేశాల మేరకు వినియోగదారులకు 24 గంటలు, 24/7 సేవలందించేందుకు కార్పొరేట్ కార్యాలయంతో పాటు సంస్థ పరిధిలోని 11 జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు లేకుండా చూసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని, పరికరాలను, సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని సూపరెంటెండింగ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను సీఎండీ ఆదేశించారు. అధికారులందరూ వినియోగదారు లకు అందుబాటులో ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో సిబ్బందికి ఎటువంటి సెలవులు మంజూరు చేయవద్దని ఎస్ఈలకు సూచించారు. విద్యుత్ అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని వినియోగదారులు కంట్రోల్ రూమ్ నంబర్లకు తెలియజేసి, సత్వర పరిష్కారం పొందవచ్చని ఏపీఈపీడీసీఎల్ ప్రకటించింది.

పెందుర్తిలో నకిలీ పోలీసుల హల్‌చల్

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని సౌభాగ్యరాయపురం వద్ద ఇద్దరు నకిలీ పోలీసులు హల్‌చల్ చేశారు. ఈ నెల 6న గాజువాకకు చెందిన జయరాం అతని కాబోయే భార్యతో కలిసి బైక్‌పై విజయనగరం వెళ్తుండగా, ఈ నకిలీ పోలీసులు అడ్డగించారు. తాము పోలీసులమని చెప్పి, బైక్ సీజ్ చేస్తామని, అరెస్ట్ చేస్తామని బెదిరించారు. కేసు లేకుండా చేయాలంటే రూ.20 వేలు డిమాండ్ చేశారు. రూ.5 వేలు మాత్రమే ఫోన్‌పేలో ఉన్నాయని చెప్పడంతో, దుండగులు ఆ మొత్తాన్ని తమ ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. నకిలీ పోలీసులన్న అనుమానం వచ్చిన బాధితుడు పెందుర్తి పోలీసులను ఆశ్రయించాడు. సీఐ కేవీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీవీఎంసీలో పలువురికి బదిలీలు

అల్లిపురం: జీవీఎంసీలో పలువురు అధికారులకు మంగళవారం సాయంత్రం బదిలీలు జరిగాయి.

అధికారి	హోదా	ప్రస్తుతం పనిచేస్తున్న స్థానం	బదిలీ అయిన స్థానం
కె. చక్రవర్తి	సహాయ సంచాలకులు	వ్యవసాయ శాఖ (విశాఖ)	జీవీఎంసీ జెడీఎస్ (అనకాపల్లి)
శాంతకుమారి	స్పెషల్ గ్రేడ్ కమిషనర్	వెయిటింగ్	యూసీడీ, జీవీఎంసీ
ఎల్.సురేష్	గ్రేడ్-2 కమిషనర్	జీవీఎంసీ డీపీవో	సీడీఎంఏకు రిపోర్ట్
పీపీపీ వాణి	స్పెషల్ గ్రేడ్ కమిషనర్	వెయిటింగ్	జీవీఎంసీ ప్రాజెక్టు అధికారి
టీటీ రత్నకుమార్	గ్రేడ్-2, కమిషనర్	జీవీఎంసీ పీవో	సీడీఎంఏకు రిపోర్ట్
బంటు సన్యాసినాయుడు	ఆడిట్ అధికారి	ఆడిట్ ఆఫీసర్ (విజయనగరం)	జీవీఎంసీ పీవో
మణికుమార్	ఉప కార్యనిర్వాహక ఇంజనీర్	విజయనగరం	జీవీఎంసీ
కేజేఎన్ నరసింగరావు	ఉపకార్యనిర్వాహక ఇంజనీర్	జీవీఎంసీ	విజయనగరం
టి.రాయల్‌బాబు	కార్యనిర్వాహక ఇంజనీర్	విజయనగరం	జీవీఎంసీ
సీపాన జయరాం	పశువైద్యాధికారి	జీవీఎంసీ వెటర్నరీ అధికారి	సాలూరు కమిషనర్
కేవీ సత్యనారాయణ	సహాయ ఇంజనీర్	జీవీఎంసీ	శ్రీకాకుళం కార్పొరేషన్
వైపీఆర్ కిరణ్	సహాయ ఇంజనీర్	శ్రీకాకుళం కార్పొరేషన్	జీవీఎంసీ
ఎం.సత్యనారాయణ	సహాయ ఇంజనీర్	జీవీఎంసీ	ఇచ్ఛాపురం మున్సిపాలిటీ
ఎస్.రవికుమార్	సహాయ ఇంజనీర్	విజయనగరం కార్పొరేషన్	జీవీఎంసీ
వి.అలేఖ స్వామి	సహాయ ఇంజనీర్	జీవీఎంసీ	సాలూరు
శ్రీరంగం రవి కుమార్	సహాయ ఇంజనీర్	బొబ్బిలి	జీవీఎంసీ
పి.తులసి	సహాయ ఇంజనీర్	జీవీఎంసీ	నర్సీపట్నం
పి.గణేష్	సహాయ ఇంజనీర్	నర్సీపట్నం	జీవీఎంసీ

ఏఐ సాంకేతికతతో ప్రపంచ అవసరాలు కొత్తపుంతలు



ఐఐఏఎం ఫ్యాకల్టీతో అగర్వాల్, ఇతర అధికారులు

ఎంవీపీ కాలనీ: మేనేజ్‌మెంట్ విద్యావిధానంలో అంతర్జాతీయ ఎక్స్‌పోజర్, మార్కెటింగ్ వ్యూహాలు, సర్వీస్ మార్కెటింగ్‌లో ప్రపంచ విధానాలపై స్థానిక ఐఐఏఎం బిజినెస్ స్కూల్ వేదికగా ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఇండో గల్ఫ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఐజీఎంఏ) అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌లాల్ అగర్వాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఏఐ సాంకేతికతతో ప్రపంచ అవసరాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయన్నారు. మేనేజ్‌మెంట్ విద్యపై సైతం ఆధునిక సాంకేతికత ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచంలోని ఇండస్ట్రియల్, సాంకేతిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. అనంతరం సర్వీస్ మార్కెటింగ్‌లో ప్రపంచ విధానాలు, అంతర్జాతీయ అవకాశాలను విద్యావిధానానికి అనుసంధానం చేయడం, వివిధ సర్వీస్ క్లస్టర్లను ఏకీకృతం చేయడం వంటి అంశాలపై చర్చించారు. తొలుత ఐఐఏఎం ఫ్యాకల్టీతో ఇంటరాక్షన్ సెషన్‌ను సంస్థ డీన్ డాక్టర్ సుంకరి రవీంద్ర ప్రారంభించారు. కార్యక్రమంలో ఐఐఏఎం బీస్కూల్ ఫ్యాకల్టీ, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.